# పెళ్లికాని కోడలు

సాయంత్రపు నీరెండ వాళ్లమీద పడుతోంది. గుడి ముందున్న మెట్లమీద కూర్చున్నారు వాళ్లిద్దరూ.

"ఎన్నాళ్లిలా?" శ్యామలను అడిగాడు నిరంజనం.

"నేను సిద్ధంగానే వున్నాను. కానీ ముందు నువ్వు నీ బాధ్యతను నిర్వర్తించాలి కదా" అన్నది శ్యామల.


"అవును. బ్యాంక్‌లోన్‌కి అప్లయ్ చేశాను, ఇంకో నెల రోజులు టైము పడుతుంది. అయినా ఇంకొంచెం డబ్బు కావాలి. అలా అయితేనే గానీ నా చెల్లెలు పెళ్లి జరగదు శ్యామలా" అన్నాడు నిరంజనం.

"నీలో వున్న ఈ గుణం వల్లనే నిన్ను నేను ప్రేమించాను నిరంజనం. ఈ రోజుల్లో ఎంతమంది యువకులు తన కుటుంబం గురించి ఆలోచిస్తున్నారు? ఎవరి స్వార్థం వాళ్లు చూసుకొంటున్నారు. కానీ నువ్వు నీ చెల్లెలి పెళ్లికోసం తాపత్రయపడుతున్నావు. అప్పటి వరకూ మన పెళ్లి జరగదని అంటున్నావు. నీ యిష్ట ప్రకారమే చేద్దాం. నీ చెల్లెలు శారద పెళ్లి అయిన తర్వాతనే మనం పెళ్లిచేసుకుందాం" అన్నది శ్యామల.

"అంతే శ్యామలా... నా చెల్లెలి పెళ్లి తర్వాతనే మన పెళ్లి" అన్నాడు నిరంజనం.

అప్పుడు శ్యామల నవ్వి "భౌతికంగా మన పెళ్లి జరుగుతుంది. అంతే... మానసికంగా మనిద్దరికీ ఎప్పుడో పెళ్లయింది. నేను నీ భార్యగానే ఫీలవుతున్నాను. నువ్వు నా భర్తవి" అన్నది.

"నిజమే శ్యామలా... మనిద్దరి మనసులూ కలిసాయి. ఈ భావనే నాకెంతో తృప్తిని, సంతోషాన్నీ ఇస్తోంది" అన్నాడు నిరంజనం.



వాళ్లిద్దరూ ప్రేమికులు. నిరంజనం ఓ ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నాడు. శ్యామల ఒక కమర్షియల్ బ్యాంక్‌లో జాబ్ చేస్తోంది. వాళ్లు రోజూ సాయంత్రం వేళ ఆ గుళ్లో కలుసుకుంటారు.

* * *

ఆ మర్నాడు సాయంత్రం ఆఫీసునుంచి తిరిగి వస్తూ రద్దీగా వున్న



రోడ్‌ని దాటుతున్న ప్పుడు జరిగిన యాక్సిడెంట్‌లో నిరంజనం చనిపోయాడనే వార్త తెలిసినప్పుడు శ్యామల నమ్మలేదు. తర్వాత గుండెలు పగిలేలా ఏడ్చింది. తన భర్త పోయినంతగా బాధ పడింది. చివరకు చేసేది లేక గుండెను రాయిచేసుకుంది. నిరంజనం వదిలి వెళ్లిన బాధ్యతలను అతడి భార్యగా స్వీకరించటానికి సిద్ధమయింది.

* * *

శ్యామల వేళ్లేసరికి నిరంజనం తల్లిదండ్రులు విచారవదనాలతో వరండాలో కూర్చుని వున్నారు. వాళ్ల ఎదురుగా ఒక కుర్చీ ఖాళీగా వుంది. శ్యామల ఆ కుర్చీలో కూర్చుంటున్నప్పుడు నిరంజనం చెల్లెలు శారద వచ్చి శ్యామలను ఆశ్చర్యంగా చూసి "ఎవరు మీరు?" అనడిగింది.

"నేను మీ వదిన్ని" చెప్పింది శ్యామల. శ్యామల అలా అనగానే నిరంజనం తండ్రి కోదండపాణి కల్పించుకుని "మా నిరంజనానికి పెళ్లి కాలేదు, కానీ నువ్వు కోడలినని అంటున్నావు. నాకు ఇద్దరు కొడుకులు లేరు" అన్నాడు.


"ఆ విషయం నాకు తెలుసు. నిరంజనానికి, నాకూ మానసికంగా యేనాడో పెళ్లి జరిగిపోయింది. నిరంజనం నా భర్త" అంద శ్యామల.

"అమ్మాయ్... నువ్వెవరో మాకు తెలీదు. నిరంజనం యేరోజూ నీ గురించి చెప్పలేదు. నీ మాటలు మాకు అర్థం కావటంలేదు. కొంచెం వివరంగా చెప్పు" అన్నాడు కోదండపాణి.

నిరంజనం తల్లి శ్యామలను ఆశ్చర్యంగా చూస్తోంది.

"నా పేరు శ్యామల. బ్యాంక్‌లో ఉద్యోగం

ప్రతాప రవిశంకర్




చేస్తున్నాను. నిరంజనం, నేను ప్రేమించుకున్నాం. పెళ్లి కూడా చేసుకోవాలని అనుకున్నాం... కానీ తన చెల్లెలు శారద పెళ్లయితే గానీ తను పెళ్లి చేసుకోనని అన్నాడు. కట్నం డబ్బు లేనందువల్ల పెళ్లి వాయిదా పడిందని చెప్పాడు. మేమిద్దరం మానసికంగా ఏనాడో భార్యా భర్తలమయ్యాం. ఇప్పటికీ నా దృష్టిలో నిరంజనమే నా భర్త" అన్నది శ్యామల.

వాళ్లు శ్యామలను విస్మయంతో చూసారు. నమ్మలేకపోయారు. ఇలా కూడా జరుగుతుందా?

"అంతే కాదు. ఇప్పుడు నేను మీ కుటుంబంలో ఒకదాన్ని. నిరంజనం పూర్తిచెయ్యవలసిన బాధ్యతలను అతడి భార్యగా, ఈ ఇంటి కోడలిగా నేను స్వీకరిస్తున్నాను. అందులో భాగంగానే శారద పెళ్లికోసం నిరంజనం ప్రయత్నం చేసిన లక్షరూపాయలను నేను తీసుకువస్తాను. ఆ డబ్బుతో శారద పెళ్లి జరిపిద్దాం".

ఆ మాటలతో వాళ్లకి మతిపోయినట్లయింది. తమ కుటుంబంతో ఎటువంటి సంబంధమూ లేని ఒక యువతి తమ కుమార్తె పెళ్లి కోసం లక్ష రూపాయలను తీసుకువస్తుందా?

శారదకయితే కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"వదినా" అంటూ రివ్వున వచ్చి శ్యామల మీద వాలిపోయి వెక్కివెక్కి ఏడవసాగింది. కోదండపాణి, ఆయన భార్య శారద దగ్గరికి వచ్చి వాత్సల్యంతో ఆమె తల నిమిరారు.

శ్యామల వారి పాదాలకు నమస్కరించింది. అప్పుడు ఆమె తల మీద, మెడమీద వెచ్చటి కన్నీటి బొట్లు పడ్డాయి, అవి కొడుకు నిరంజనం చనిపోయినందుకు విచారంతో వచ్చిన కన్నీళ్లు మాత్రమే కాదు... కోడలు వచ్చినందుకు వచ్చిన ఆనందభాష్పాలు కూడా.